## క్లుప్తంగా

### పౌష్టికాహారంపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

జి.సిగడాం: కిశోర్ బాలికంతా పౌష్టికాహారం తోపాటు పోషక విలువలతో కూడిన ఆహారాన్ని సకాలంలో తీసుకోవాలని ఎచ్చెర్ల ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సూపర్‌వైజర్ తమ్మినేని లక్ష్మి అన్నారు. పాలఖండ్యాం యూపీ పాఠశాలలో పరిసరాల పరిశుభ్రత, వ్యాధులు, బాల్యవివాహాలపై శుక్రవారం అవగాహన కల్పించారు. బాలికలు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, అంగన్వాడీ కార్యకర్తలు, ఎంఎస్ఎంలు, ఆశ కార్యకర్తలు ఉన్నారు.

### సాయిరాంకు అభినందనలు



సాయిరాంను అభినందిస్తున్న సంఘ నాయకులు

శ్రీకాకుళం అర్బన్: ఇటీవల రిమ్స్ మెడికల్ కళాశాల కార్యాలయ సూపరింటెండెంట్‌గా పదోన్నతి పొందిన జిల్లా జాయింట్ ఎక్షన్ కమిటీ చైర్మన్, ఆంధ్రప్రదేశ్ నాన్ గజిటెడ్, గజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు హనుమంతు సాయిరాంని స్థానిక ఎన్‌జీవో కార్యాలయంలో శుక్రవారం సన్మానించారు. ఆంధ్రప్రదేశ్ ఎకనామిక్స్ స్టాటిష్టికల్ సబార్డినేట్ ఆఫీసర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బి.సుధాకర్, కార్యదర్శి బిజి మనోహరరావు తదితరులు పుష్పగుచ్ఛం, శాలువతో సత్కరించి అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో ఎన్‌జీవో సంఘ నాయకులు బడగల పూర్ణచంద్రరావు, పి.సి.నందా, ఏ.మురళీకృష్ణ, పి.బాలరాజు, ఎన్.శేఖర్‌బాబు, బి.గోవింద్, పి.అప్పలనాయుడు, వై.జోగారావు, పి.గణపతిరావు పాల్గొన్నారు.

### విద్యుద్దీపాలంకరణలో సంతోషిమాత గుడి



సంతోషిమాత ఆలయం

శ్రీకాకుళం కల్చరల్: పాత శ్రీకాకుళంలోని సంతోషిమాత ఆలయ వార్షికోత్సవాలు ఈ నెల 13నుంచి ప్రారంభమవుతున్న సందర్భంగా ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. అర్చకులు కిరణ్‌శర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి శుక్రవారం అభిషేకాలు అర్చనలు, కుంకుమ పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

### భక్తిశ్రద్ధలతో కుమార షష్టి



సుబ్రహ్మణ్యస్వామికి పుష్పార్చన

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని నక్కవీధిలో ఉమా జలలేశ్వరస్వామి ఆలయంలో కొలువైన వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామికి శుక్రవారం కుమార షష్టి పూజలు నిర్వహించారు. అర్చకులు బి.అశ్వనీకుమార్, మహేష్ ఆధ్వర్యంలో స్వామికి ప్రాతఃకాల పూజలు పంచామృతాభిషేకాలు, విశేష పుష్పాలంకరణ, అష్టోత్తర శతనామార్చన పూజలు జరిగాయి. పలువురు భక్తులు పాల్గొన్నారు.

### 17న 'హ్యాపీనెస్' శిక్షణ

శ్రీకాకుళం కల్చరల్: ఇందిరావిజ్ఞాన్ భవన్‌లో గురుపూర్ణిమ సందర్భంగా ఈ నెల 17న ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఆధ్వర్యంలో హ్యాపీనెస్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు టీచర్ నంబాళ్ల కల్పన ఒక ప్రకటనలో తెలిపారు. యోగ, ప్రాణాయామం, మెడిటేషన్, శ్వాస, సుదర్శన క్రియలపై శిక్షణ ఇస్తామని పేర్కొన్నారు. ఒత్తిడి, మైగ్రేన్, నిద్రలేమి వంటి సమస్యలు దూరమవుతాయని చెప్పారు. వివరాలకు 9505677388 నంబరును సంప్రదించాలని కోరారు.

# అవతార వైభవం

రథయాత్ర ఉత్సవాలల్లో భాగంగా జగన్నాథుడు రోజుకొక అవతారంలో భక్తులకు దర్శనమిస్తున్నాడు. శుక్రవారం నగరంలోని పలు జగన్నాథ స్వామి ఆలయాల వద్ద వామన, నరసింహ, మత్స్య, పాండురంగని అవతారాల్లో భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు.

- శ్రీకాకుళం కల్చరల్



గుజరాతిపేటలో మత్స్య అవతారంలో జగన్నాథుడు



పాండ్రంగి వీధిలో పాండురంగనిగా..



ఇలిసుపురంలో వామనావతారంలో..



మొండేటివీధిలో నరసింహావతారంలో..

## పశువుల్ని రోడ్లపైకి వదిలితే చర్యలు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): ఆవులు, గేదెలు పెంచుతున్న యజమానులు వాటిని విచ్చలవిడిగా రోడ్లపైకి వదిలేస్తే కఠిన చర్యలు తప్పవని నగరపాలక సంస్థ కమిషనర్ చల్ల ఓబులేసు హెచ్చరించారు. పశువులను యజమానులు నిర్లక్ష్యంగా రోడ్లపైకి వదిలేయడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని చెప్పారు. శ్రీకాకుళం నగరంలో శుక్రవారం రోడ్లపై తిరుగుతున్న పశువుల్ని పరిశీలించి యజమానులకు సమాచారం ఇచ్చి భవిష్యత్‌లో ఎటువంటి చర్యలు తీసుకుంటారో తెలియజేశారు. ఏ ఒక్కరు పశువులు వదిలేసినా సీతంపేట అడవుల్లో వదిలేస్తామన్నారు. ఆవుల్ని, గేదెల్ని ఖాళీ స్థలాల్లో ఉంచుకోవాలన్నారు. రోడ్లపై విచ్చలవిడిగా తిరుగుతున్న పశువులకు సంబంధించి యజమానులపై చర్యలు తీసుకోవాలని నేరుగా కలెక్టర్ ఆదేశాలు జారీచేశారన్నారు. కార్యక్రమంలో హెల్త్ ఆఫీసర్ వెంకటరావు, కార్పొరేషన్ సిబ్బంది పాల్గొన్నారు.



పశువుల యజమానులకు సూచనలిస్తున్న కమిషనర్ ఓబులేసు

## వర్షంతో ఉపశమనం

జి.సిగడాం: మండలంలోని నాగులవలస, మర్రివలస, మానంపేట, సీతంపేట, నక్కపేట, పాలఖండ్యాం, పెంట, మెట్టవలస, టంకాలదిగ్గువలస తదితర గ్రామాలలో శుక్రవారం కుండపోత వర్షం కురిసింది. దీంతో ప్రజలు ఎండవేడి నుంచి ఉపశమనం పొందారు. మెట్టు ప్రాంతంలో వేసిన వేరుశనగ, మొక్కజొన్న, గోగు పంటలకు వర్షం జీవం పోసిందని రైతులు ఆనందం వ్యక్తం చేశారు. పాలాల్లో నీరు చేరింది.

**ఊరటనిచ్చిన వర్షం**

గార: మండల రైతుకలు శుక్రవారం కురిసిన వర్షం ఊరటనిచ్చింది. దాదాపు పది రోజులుగా చినుకులు రాకపోవడంతో అన్నదాతలు ఆందోళన చెందారు. ఎట్టకేలకు మండలమంతా వర్షం కురవడంతో రైతులు సంతోషం వ్యక్తం చేశారు.



జి.సిగడాం: పంట పొలంలో చేరిన వర్షం నీరు

## పరిసరాల పరిశుభ్రతే ప్రధానం



ఎచ్చెర్ల: మురపాకలో పనులను పరిశీలిస్తున్న సిబ్బంది

రణస్థలం: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే ఎటువంటి వ్యాధులు దరిచేరవని ఇన్‌చార్జి ఎంపీడీవో వి.ధనుంజయరావు అన్నారు. మండలంలోని కోష్ట పంచాయతీలో డ్రైడే ఫ్రైడే కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. సీజనల్ వ్యాధులపై ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలన్నార. ప్రతీ శుక్రవారం పరిశుభ్రత రోజుగా పాటించాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఆర్.శ్రీధర్, ఆశవర్కర్లు, ఏఎన్ఎంలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎచ్చెర్ల: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని మండల ఇంజినీర్ అప్పన్న అన్నారు. ఫ్రైడే, డ్రైడే కార్యక్రమంలో భాగంగా శుక్రవారం లావేరు మండలం మురపాక గ్రామంలో నిర్వహించిన ప్రత్యేక పారిశుధ్య పనులను పరిశీలించారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ప్రసాద్, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.



జి.సిగడాం: కాలువలో పూడిక తీస్తున్న కార్మికులు



రణస్థలం:పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

**సంతవురిటిలో పారిశుధ్య పనులు**

జి.సిగడాం: సంతవురిటి గ్రామంలో ప్రత్యేక పారిశుధ్య పనులు చేపడుతున్నారు. కాలువల్లో పూడిక తీత, వీధుల్లో చెత్తను శుక్రవారం తొలగించారు. పనులను సర్పంచ్ బుడారి లక్ష్మణరావు పర్యవేక్షించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని స్థానికులకు సూచించారు. పంచాయతీ కార్యదర్శి హిమబిందు, ఇంజినీరింగ్ అసిస్టెంట్ నాగరాజు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

**వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి**

ఎచ్చెర్ల క్యాంపస్: డెంగ్యూ, మలేరియా జ్వరాలపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని ఎచ్చెర్ల పీహెచ్‌సీ వైద్యురాలు ఉషారాణి అన్నారు. ఎచ్చెర్ల ప్రభుత్వ ఐటీఐలో సీజనల్ వ్యాధులపై విద్యార్థులకు శుక్రవారం అవగాహన కల్పించారు. ఎక్కువ రోజులు జ్వరం కొనసాగితే నిర్లక్ష్యం చేయకుండా వైద్యులను సంప్రదించి ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ప్రిన్సిపాల్ ఎల్.సుధాకర్ రావు, ప్లేస్‌మెంట్ అధికారి కామేశ్వరరావు పాల్గొన్నారు.

**డీఆర్‌డీఏ కాంప్లెక్సులో డ్రైడే**

శ్రీకాకుళం పాతబస్టాండ్: శ్రీకాకుళం నగరంలోని డీఆర్‌డీఏ కాంప్లెక్స్‌లో పీడీ కిరణ్‌కుమార్ ఆదేశాల మేరకు శుక్రవారం డ్రైడే నిర్వహించారు. కాంప్లెక్సు పరిసరాలను శుభ్రపరిచారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ అధికారులు పాల్గొన్నారు.

## ఘనంగా క్షీరాభిషేకం

ఎచ్చెర్ల: కుంచాలకుర్మయ్యపేట గ్రామంలోని ఏకోత్తర శ్రీచక్రమేరువుల దేవీ ఆశ్రమంలో మహామేరువుకు శుక్రవారం సందర్భంగా క్షీరాభిషేకాన్ని పీఠాధిపతి బాలభాస్కరశర్మ ఘనంగా నిర్వహించారు. సంప్రదాయ దుస్తులు ధరించి వచ్చిన భక్తులతో అభిషేకాలు చేయించారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలు జరిగాయి. భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.



అమ్మవారికి పూజ చేస్తున్న పీఠాధిపతి

### కలెక్టర్‌ను కలిసిన ఆశ్రా ప్రతినిధులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: నూతన కలెక్టర్ స్వప్నిల్ దినకర్‌ను ఆశ్రా (అడ్వకేట్ అసోసియేషన్ ఫర్ సోషల్ రెస్పాన్సిబిలిటీ అండ్ అవేర్నెస్) సంఘ జిల్లా ప్రతినిధులు శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిసి సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు గంజి ఎజ్రా, ఉపాధ్యక్షుడు ఇందిరా ప్రసాద్, జాయింట్ సెక్రటరీ అనిల్‌రాజు, సభ్యులు బి.రవీంద్రబాబు, రాము తదితరులు పాల్గొన్నారు.

### రాజరాజేశ్వరికి ప్రత్యేక పూజలు



రాజరాజేశ్వరీదేవికి విశేష అలంకరణ



బలగలో వారాహి అమ్మవారి హోమం

శ్రీకాకుళం కల్చరల్: గోవిందనగర్‌లోని రాజరాజేశ్వరీ ఆలయంలో అమ్మవారికి శుక్రవారం అభిషేకాలు నిర్వహించారు. అర్చకులు బంకుపల్లి చరణ్‌శంకరశర్మ, మద్దూరి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సుప్రభాతసేవ, మహాన్యాస పూర్వక నమక చమక సహిత పంచ సూక్తాలతో క్షీరాభిషేకం చేశారు. బలగలోని బాల త్రిపుర కాలభైరవ పీఠం దేవాలయంలో వారాహీ అమ్మవారి ఉత్సవాలలో భాగంగా శుక్రవారం వారాహి హోమం జరిగింది. పీఠం నిర్వాహకులు గణేష్ గురూజీ ఆధ్వర్యంలో వారాహీ యంత్ర పూజలు, హారతులు నిర్వహించారు. డీసీసీబీ కాలనీలో భూసమేత వేంకటేశ్వర స్వామి దేవాలయం మాసోత్సవాలలో భాగంగా అభిషేకాలు నిర్వహించారు. అర్చకులు చామర్తి గోపాలాచార్యులు ఆధ్వర్యంలో అష్టోత్తర శతనామాలతో పూజలు చేశారు.

### 8 మంది ట్రిపుల్ ఐటీకి ఎంపిక

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికలు గురుకుల పాఠశాలకు చెందిన ఎనిమిది మంది విద్యార్థులు ఆర్‌జీయూకేటీ సమీకృత ఇంజినీరింగ్ కోర్సుకు (ట్రిపుల్ ఐటీ) ఎంపికయ్యారు. కొబగాన నాగమణి, మామిడి శరణ్య, బోనెల వరలక్ష్మి, బెలమర నవ్యశ్రీ, గురువు రేష్మా, సవలాపురపు సుదీప్తి, మీసాల పావని, తలే పల్లవిలకు సీట్లు వచ్చాయి. వీరిని ప్రిన్సిపాల్ పద్మజ, ఉపాధ్యాయులు యశోద, పద్మావతి, పేరెంట్స్ కమిటీ సభ్యులు అప్పారావు, మహేష్, రాంబాబు అభినందించారు.

## ప్రయాణాల్లో జాగ్రత్తలు తప్పనిసరి

శ్రీకాకుళం న్యూకాలనీ/శ్రీకాకుళం పాతబస్టాండ్: ప్రయాణ సమయంలో ప్రజలు ముఖ్యంగా యువత అప్రమత్తంగా ఉండాలని జిల్లా అడిషినల్ సీనియర్ సివిల్ జడ్జి సీహెచ్ యుగంధర్ అన్నారు. శ్రీకాకుళం నగరంలోని హెచ్‌పీఎస్ డిగ్రీ కళాశాలలో శుక్రవారం మోటారు వాహన చట్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అతి వేగం ప్రమాదకరమన్నారు. మొబైల్ మెజిస్ట్రేట్ సీహెచ్ శ్రీవిద్య, పాతపట్నం జూనియర్ సివిల్ జడ్జి ఎం.రోషిణి మాట్లాడుతూ నూతన మోటారు వాహన చట్టాలపై అవగాహన కల్పించారు. ద్విచక్ర వాహనచోదకులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ తమ్మినేని రామారావు, కొత్తకోట రవీంద్ర, ప్యానెల్ అడ్వకేట్ గేదెల ఇందిరాప్రసాద్, అధ్యాపకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి యుగంధర్

## గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

శ్రీకాకుళం అర్బన్: విద్యార్థులు గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కలిగి ఉండాలని మంగువారితోట వార్డ్ ఇన్‌చార్జి రోణంకి త్రిలోచన అన్నారు. మిషన్ శక్తి 100 రోజుల అవగాహన కార్యక్రమంలో భాగంగా శుక్రవారం శ్రీకాకుళం ఐసీడీఎస్ అర్బన్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో గూనపాలెం సెక్టార్ పరిధిలోని మంగువారితోట, ఎంసీఈ స్కూల్లో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. సూపర్‌వైజర్ బి.యోగేశ్వరి మాట్లాడుతూ వర్షాకాలంలో వచ్చే వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు.

## విద్యార్థి జయదేవ్ ప్రతిభ

గార: కళ్లకు గంతలు కట్టుకొని పుస్తకంలో పాఠాలను చదవడం వంటి ఎన్నో వింతలతో అద్భుత ప్రదర్శన కనబరుస్తున్నాడు కె.మత్స్యలేశం పంచాయతీకి చెందిన సూరాడ జయదేవ్. శుక్రవారం స్థానిక బుద్ధా పాఠశాలలో 'ప్రజ్ఞ చక్షు' మూడో నేత్రం పేరిట ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. జయదేవ్‌కు కళ్లకు గంతలు కట్టిన ఉపాధ్యాయులు పేజీ తీసి చెప్పగానే వాటిలోని పాఠాలు చదివి వినిపించాడు. దూరంగా పెట్టిన వస్తువుల పేర్లు చెప్పి ఆకట్టుకున్నాడు. ఆర్ట్ ఆఫ్ లివింగ్ సంస్థలో శిక్షణ తీసుకోవడంతో పాటు తండ్రి, ఆర్ట్ ఆఫ్ లివింగ్ టీచర్ సూరాడ రాంబాబు సారథ్యంలో కఠోర సాధన చేశాడు. ఈ సందర్భంగా జయదేవ్‌ను పాఠశాల కరస్పాండెంట్ బి.ఎర్రన్న, సర్పంచ్ బి.లలిత ఎర్రన్న సత్కరించారు.



ప్రదర్శన చేస్తున్న సూరాడ జయదేవ్

## బాల్య వివాహాలను వ్యతిరేకించాలి

శ్రీకాకుళం అర్బన్: బాల్యవివాహాలను అరికట్టాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని ఐసీడీఎస్ శ్రీకాకుళం అర్బన్ కృష్ణా పార్కు సెక్టారు సూపర్‌వైజర్ పి.సీతామహలక్ష్మి అన్నారు. నగరంలోని కొన్నావీధి పరిధిలోని పీఎస్ఎన్ఎంహెచ్ పాఠశాలలో 8, 9, 10వ తరగతుల కిశోరి బాలికలకు శుక్రవారం మిషన్‌శక్తి 100 రోజుల ప్రత్యేక కార్యక్రమంపై అవగాహన కలిగించారు. గుడ్ టచ్ అండ్ బ్యాడ్ టచ్, అమ్మాయిల అక్రమ రవాణా తదితర అంశాలను వివరించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్ఎంలు భాస్కరరావు, ఎంఎస్‌కేలు మనీషా, ప్రవీనా బేగం, సర్యాస్, యమునా, ఇన్‌చార్జిలు బాలశివప్రసాద్, రమణ, షాను, ముబాక్, అంగన్వాడీ కార్యకర్తలు ఆదిలక్ష్మి, సంధ్యారాణి, సునీత, ప్రసన్న, ఇందిర, దీప, లక్ష్మి, భానుమతి పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న దృశ్యం

## న్యాయవాదులకు వైద్య పరీక్షలు

శ్రీకాకుళం పాతబస్టాండ్: విశాఖకు చెందిన మహాత్మాగాంధీ క్యాన్సర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో జిల్లా బార్ అసోషియేషన్‌లో శుక్రవారం ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా ఈ శిబిరాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో బార్ అధ్యక్షుడు ఈశ్వరరావు, కార్యదర్శి ప్రసన్న, న్యాయవాదులు అగూరు ఉమామహేశ్వరరావు, మామిడి క్రాంతి, కొమ్ము రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## జీరుపాలెం వాసులకు రేషన్ కష్టాలు!

రణస్థలం: మండలంలోని జీరుపాలెం మత్స్యకార గ్రామంలోని సుమారు 900 రేషన్‌కార్డు దారులు ఉన్నా ఈ నెలకు సంబంధించి ఇప్పటి వరకు రేషన్ బియ్యం అందలేదని గ్రామస్తులు తెలిపారు. గ్రామంలో నలుగురు రేషన్ డీలర్లు ఉన్నారు. ఒక్కరి దగ్గర నుంచిడి ఒక్క కేజీ బియ్యం కూడా లబ్ధిదారులకు చేరలేదు. ఇందుకు కారణం వేలిముద్ర వేసే మిషన్ సర్వర్ పని చేయడం లేదని చెబుతున్నారు. 12 రోజులుగా రేషన్ వాహనం వస్తుండడంతో కార్డుదారులంతా క్యూ కడుతున్నారు. తీరా సర్వర్ పని చేయడంతో వాహనం వెళ్లిపోతున్నట్టు గ్రామస్తులు తెలిపారు. ఈ విషయాన్ని మండల సివిల్ డిప్యూటీ తహసీల్దార్ హేమసుందర్ వద్ద ప్రస్తావించగా.. ఆ గ్రామంలో సెల్ టవర్ సమస్య ఉందన్నారు. జియో, ఎయిర్‌టెల్ నెట్‌వర్క్ పనిచేయకపోవడంతో సర్వర్ ఓపెన్ కావడం లేదన్నారు. ఈ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామన్నారు. అనుమతులు రాగానే శనివారం ఉదయం నుంచి ఆఫ్‌లైన్‌లో రేషన్ అందజేస్తామని చెప్పారు. లబ్ధిదారులు ఎవరూ కంగారుపడాల్సిన పని లేదని.. ఈ నెల 17వ తేదీ వరకు సమయం ఉందన్నారు.